క్లుప్తంగా

విద్యాభివృద్ధి కోసం సీఎం కృషి



స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని జవహర్ బాల్‌మంచ్ (జేబీఎం) జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ సుదర్శన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలికల-1 గురుకుల పాఠశాలలో సుదర్శన్ ఆధ్వర్యంలో విద్యార్థినులు డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపునకు కృతజ్ఞతలు తెలుపుతూ సీఎంకు లేఖలు రాశారు. అనంతరం ప్రిన్సిపాల్ లక్ష్మి, నాహిదాబేగం, టీచర్లకు జేబీఎం క్యాలెండర్లను అందజేశారు. కార్యక్రమంలో ఆ మంచ్ జిల్లా కోఆర్డినేటర్లు ప్రసాద్ ముదిరాజ్, శ్రీకాంత్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' దరఖాస్తుల పరిశీలన

భూత్పూర్ : మండలంలోని భట్టుపల్లి గ్రామంలో సోమవారం తహసీల్దార్ జయలక్ష్మి, ఎంపీడీఓ ప్రభాకర్ ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను పరిశీలించారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులతో ఇంటింటికీ తిరిగి అధికారులు వివరాలు సేకరించారు. గ్రామ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నాయకులు భూపతిరెడ్డి, రఘుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎస్సీలకు కేటాయించాలని వినతి

మండలంలోని ఎల్కిచర్ల సర్పంచ్ స్థానాన్ని ఎస్సీలకు కేటాయించాలని మాదిగ యువశక్తి సంఘం సభ్యులు సోమవారం తహసీల్దార్ జయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఇప్పటి వరకు ఎల్కిచర్ల స్థానం ఎస్సీలకు కేటాయించలేదని, ఈసారైనా అవకాశం ఇవ్వాలని వారు కోరారు. మాదిగ యువశక్తి సంఘం సభ్యులు యాదయ్య, భీమన్న, కృష్ణయ్య, కుర్మయ్య, తిరుపతయ్య ఉన్నారు.

యువకుడు అదృశ్యం



నరేష్‌కుమార్

నవాబుపేట: ఇంట్లో చెప్పకుండా వెళ్లిన యువకుడి కోసం తల్లిదండ్రులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. మండలంలోని యన్మన్‌గండ్లకి చెందిన బ్యాగరి నరేష్ కుమార్(21) ఈ నెల 8న ఇంట్లో చెప్పకుండా బయటికెళ్లాడు. ఎంత వెతికినా జాడ లభించలేదు. యువకుడి తల్లి అనసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అడ్డాకుల: మూసాపేట మండలం నందిపేటకి చెందిన బుచ్చన్నగౌడ్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని సోమవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ మూసాపేట మండల గౌడ సంఘం నాయకులు పరామర్శించారు. బుచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బుచ్చన్నగౌడ్, తిరుపతయ్యగౌడ్, రవీందర్‌గౌడ్, శరత్‌చందర్‌గౌడ్, విజయకుమార్‌గౌడ్, చంద్రయ్యగౌడ్ ఉన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

నవాబుపేట: తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. మండలంలో అన్ని గ్రామాల్లో వేసవిని దృష్టిలో ఉంచుకొని పదిరోజుల పాటు చేపట్టిన తాగునీటి స్పెషల్ డ్రైవ్ సోమవారంతో ముగిసిందన్నారు. ప్రధానంగా మేజర్ పంచాయతీల్లో సమస్యలు రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. అత్యవసరం అనుకుంటే ట్యాంకర్లను సైతం అందుబాటులోకి తీసుకువచ్చేలా ఏర్పాట్లు గ్రామాలవారీగా పూర్తి చేశామని వారు వివరించారు. అధికారులు ఉన్నారు.

నేడు పోలింగ్ కేంద్రాల ప్రకటన

నవాబుపేట: మండలంలో ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను మంగళవారం ప్రకటిస్తున్నట్లు ఎంపీడీఓ జయరాం నాయక్ తెలిపారు. ఈసందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల అధికారుల సమాచారం ప్రకారం 11న పోలింగ్ కేంద్రాల ప్రకటనచేసిన అనంతరం 13 వరకు అభ్యంతరాల స్వీకరణ, 14న రాజకీయ పార్టీలతో సమావేశం, 15న తుది జాబితాను అధికారికంగా ప్రకటిస్తామన్నారు.

జడ్చర్ల సీఐ బదిలీ

జడ్చర్ల: జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి ఆకస్మికంగా బదిలీ అయ్యారు. సోమవారం రాత్రి ఆయనను బదిలీచేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఆయన స్థానంలో సిద్దిపేట నుంచి కమలాకర్‌ను నియమించారు. సీఐ బదిలీ కావడంపై పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- వేదమంత్రాలతో విగ్రహాల ప్రతిష్ఠాపన



దివిటిపల్లి డబుల్ బెడ్‌రూం కాలనీలో శ్రీ జిట్టా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దివిటిపల్లి డబుల్ బెడ్‌రూం కాలనీలో శ్రీజిట్టా ఆంజనేయస్వామి, నవగ్రహ దేవతలను, ధ్వజస్తంభం, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్షణగా నిలబడే ఆంజనేయస్వామిని, గ్రామాన్ని కంటికి రెప్పలా కాపాడే బొడ్రాయిని కాలనీలో అంగరంగ వైభవంగా ప్రతిష్ఠించుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. ఈదేవాలయం దేదీప్యమానంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య విగ్రహాల ప్రతిష్ఠాపన జరిగింది. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్‌చైర్మన్ షబ్బీర్ అహ్మద్, నిర్వాహకులు శివప్రసాద్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాసులు, జె.చంద్రశేఖర్, మురళీ పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటుతో సమగ్రాభివృద్ధి

స్టేషన్ మహబూబ్‌నగర్: కార్పొరేషన్ ఏర్పాటుతో మహబూబ్‌నగర్ సమగ్రాభివృద్ధి సాధిస్తుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఆల్‌మేవా నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలో సంఘ భవనానికి స్థలం కేటాయించాలని సభ్యులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి శంకరాచారి, ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు షేక్ ఫారుఖ్ హుస్సేన్, సయ్యద్ వహీద్‌షా, డాక్టర్ షేక్ ఫరీద్, మహ్మద్ అయూబ్, అబ్దుల్‌ఖాదర్, కాంగ్రెస్ నాయకులు హనీఫ్ అహ్మద్, ఫయాజ్, సాదుల్లా, నజీర్, యూసుఫ్‌బిన్‌నాసర్, తాహెర్ పాల్గొన్నారు.

ముందంజలో నిలిపేందుకు కృషి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు తనవంతుగా కృషిచేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అపెక్స్, తక్షశిల, జ్ఞానభారతి, లిటిల్‌స్కాలర్స్ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు డిజిటల్ కంటెంట్‌ను ఆయన పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు పర్వేజ్, భాస్కర్‌రెడ్డి, కిరణ్మయి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

జడ్చర్ల లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- నేడు కల్యాణోత్సవం



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

జడ్చర్ల టౌన్: స్థానిక లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రతిఏటా మాఘశుద్ధ త్రయోదశి రోజున బ్రహ్మోత్సవాలు ప్రారంభించటం ఆనవాయితీగా వస్తుంది. గంగాపూర్ లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవాలు ముగిసిన నాలుగురోజుల తర్వాత జడ్చర్ల వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, కంకణపూజ, అంకురార్పణం, గోపూజ, ప్రదోషపూజలు జరిపించారు.

వైభవంగా జరపనున్న కల్యాణం

బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు మంగళవారం ధ్వజారోహణం చేశాక స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శాలిబండ శ్రీరాఘవేంద్ర భజనమండలి, పాలమూరు రాఘవేంద్ర సేవాసమితి వారిచే భజనలు, కోలాటాలు, నృత్యాలతో వైభవంగా కల్యాణాన్ని జరిపించనున్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించే కల్యాణానికి మహిళలు, భక్తులు అధికసంఖ్యలో హాజరుకానున్నారు. కల్యాణోత్సవం అనంతరం రాత్రి పుష్ప రథోత్సవం వేడుక నిర్వహిస్తారు. మూడో రోజు బుధవారం మద్భగవద్గీత, శ్రీవిష్ణుసహస్రనామ పారాయణం, రాత్రి 9గంటలకు మారుతి భజనమండలి, వెంకటేశ్వరభక్త మండలితో చిడతల భజనలు, 11 గంటలకు రథోత్సవం ఉంటుందన్నారు. నాలుగోరోజు గురువారం శకటోత్సవం, బండ్ల ఊరేగింపు చేయనున్నారు. 18వ తేదీన గరుడ, శేషవాహన సేవలపై ఊరేగించి చక్రతీర్థంతో ఉత్సవాలు ముగించనున్నారు.

ఆలయంలో స్వామిపాదం మోపారని ప్రచారం

శతాబ్దం కిందట స్వయంగా వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చి పాదం మోపారని పూర్వీకులు చెబుతున్నారు. ఇందుకు సాక్ష్యంగా ఆలయ గర్భగుడి ఎదురుగా ఉన్న రాతిపై చిన్నపాదం గుర్తు ఉంది.

పూర్వవైభవం కోసం ప్రయత్నాలు

ఆలయానికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఆలయ స్తంభాలకు ఉన్న పెయింటింగ్ తొలగించి ప్రకృతి సహజసిద్ధంగా ఉండే శిలల మాదిరిగా తీర్చిదిద్దుతున్నారు. ఆలయ ముఖద్వారం వద్ద రాజగోపుర నిర్మాణపనులు కొనసాగుతున్నాయి. ఈకారణంగా బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు కొంత అసౌకర్యం కలగక మానదు.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

లక్ష్మీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నాం. ఉత్సవాల్లో భక్తులు భాగస్వాములై జయప్రదం చేయాలి.

కొత్రమధు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు, జడ్చర్ల

50 ఏళ్లకుపైగా భాగస్వామ్యం

లక్ష్మీవెంకటేశ్వరస్వామికి బ్రహ్మోత్సవాల నిర్వహణలో 50ఏళ్లకు పైగానే భాగస్వామ్యం అవుతున్నా. తమ పూర్వీకుల నుంచి వచ్చిన ఆచారాన్ని కొనసాగిస్తున్నాం. ఉత్సవాల కోసం ఇప్పటికే ప్రభుత్వశాఖలకు సమాచారమందించి ఏర్పాట్లు పూర్తిచేశాం.

–నరహరిభీంసేనాచార్య, వంశపారంపర్య ధర్మకర్త,

'సంచార' వాహనాన్ని సద్వినియోగించుకోండి

- కలెక్టర్ విజయేందిర బోయి



వాహన రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారురాలికి అందజేస్తున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇందిరా మహిళా శక్తి ద్వారా సబ్సిడీపై స్త్రీనిధి బ్యాంక్ రుణం ద్వారా అందించిన సంచార చేపల విక్రయ వాహనాన్ని సద్వినియోగించుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఆసంచార చేపల విక్రయ వాహనాన్ని లబ్ధిదారురాలు కోయిల్‌కొండకు చెందిన కర్నె కవితకు కలెక్టర్ వాహన రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వాహనంతో లబ్ధిదారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. లబ్ధిదారురాలు కవిత మాట్లాడుతూ సబ్సిడీపై వాహనం లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. జిల్లా మత్స్య శాఖ అధికారిణి రాధ రోహిణి, ఎల్‌డీఎం భాస్కర్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

భూత్పూర్: చిలుకూరి బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకుడు, ఆధ్యాత్మిక వేత్త రంగరాజన్‌పై దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలని శ్రీవైష్ణవ వికానస బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు అయ్యవారి పవన్‌కుమార్ శర్మ, ఉపాధ్యక్షుడు నరహరిఆచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాలయాలను కాపాడుతున్న అర్చకులు, సనాతన ధర్మాన్ని రక్షించే బ్రాహ్మణులపై దాడి చేయడం తగదని వారు పేర్కొన్నారు.

తప్పుడు పోస్టుపై ఫిర్యాదు

జడ్చర్ల: సోషల్ మీడియాలో తప్పుడు పోస్టు చేసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసిన సంఘటన చోటుచేసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి మరణించారంటూ చుక్కల్లోకి ఎక్కినాడు సక్కనోడు అనే పాటను జోడించి ఓ యూట్యూబ్ ఛానల్, వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన పోస్టుపై పట్టణ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై విచారించి చర్యలు తీసుకుంటామని సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

విద్యార్థిని అభినందించిన డీఈఓ



విద్యార్థి తరుణ్‌ను అభినందిస్తున్న డీఈఓ ప్రవీణ్‌కుమార్

గండీడ్: మండల కేంద్ర బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి జే తరుణ్ ఫిజికల్‌సైన్స్ టాలెంట్‌టెస్ట్‌లో మొదటిస్థానం సంపాదించాడు. సోమవారం జిల్లా విద్యాధికారి (డీఈఓ) ప్రవీణ్‌కుమార్ విద్యార్థి తరుణ్‌ను అభినందించి ప్రశంసాపత్రాన్ని, జ్ఞాపికను అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నా ప్రతిభ కనబర్చడం గర్వించదగ్గ విషయమన్నారు. తరుణ్ భవిష్యత్‌లో మరింత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో మొదటిస్థానంలో నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఎంఓ బాలునాయాదవ్, శ్రీనివాస్, ఎఫ్‌పీటీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, జనార్దన్, పాఠశాల హెచ్‌ఎం ఆర్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివస్వాముల మహా పడిపూజ



జడ్చర్ల టౌన్: మండలంలోని మీనాంబరం పరుషవేదీశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివస్వాముల మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు విజయ్‌కుమార్, కృష్ణయ్య ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన రామకృష్ణ రమాదేవి దంపతులు పడిపూజ చేశారు. పడిపూజ సందర్భంగా పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో శివస్వాములు పాల్గొన్నారు. పడిపూజ అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సునీత, భద్రప్ప, యాదయ్య, పర్వతాలు, కైలాస్‌జవహర్, శ్రీనివాసులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సత్తా చాటాల్సిన సమయం ఆసన్నం

- ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్



జెండాను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్‌లు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లు తమ సత్తా చాటాల్సిన సమయం ఆసన్నమైందని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని తెలుగు గూడెంలో ముదిరాజుల ఆత్మగౌరవ ప్రతీక జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా పరంగా ముదిరాజుల సంఖ్య అధికంగా ఉన్నా రాజ్యాధికారంలో భాగస్వామ్యం కాలేకపోతున్నామన్నారు. ప్రభుత్వాలు మారినా ముదిరాజ్‌ల బతుకులు మాత్రం మారడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. బీసీ ముదిరాజ్ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు మైత్రి యాదయ్య, ప్రముఖ కవి రచయిత బోల యాదయ్య మాట్లాడుతూ ముదిరాజుల ఐక్యమత్యంగా ఉండి రాబోయే ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ ముదిరాజ్ మాట్లాడుతూ తాజాగా జరిగిన కుల గణనలో సంఖ్యను తగ్గించి చూపించడం జరిగిందని పార్టీలు ఏవైనా ముదిరాజులను అవమానపరచడం పార్టీలకు పరిపాటిగా మారిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆశన్న, వెంకటేష్, బాలు ముదిరాజ్, రవి, ఆంజనేయులు, రామచంద్ర, శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ రాములు, సిద్దయ్య, పోషన్న, పెంటయ్య, హనుమంతు, బాలస్వామి, కాశీం పెద్దమాసన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

12 నుంచి శివభక్తులకు అన్నప్రసాద సేవ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహా శివరాత్రిని పురస్కరించుకొని శ్రీశైలం వెళ్లే శివభక్తులకు స్థానిక నాగేంద్రనగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఈనెల 12 నుంచి 22వ తేదీ వరకు నిత్యం అన్నప్రసాద సేవ ఉంటుందని సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా రోజుల్లో మధ్యాహ్నం 12.30 నుంచి 3.30 వరకు అన్న ప్రసాద వితరణ కొనసాగుతుందని పేర్కొన్నారు.

భూసార పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు



భూసార పరీక్ష కేంద్రంలో విద్యార్థులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని భూసార పరీక్షకేంద్రాన్ని సోమవారం డిగ్రీ కళాశాల వృక్ష, రసాయన శాస్త్రాల విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులు సంస్థాపిత సందర్శనలో భాగంగా సందర్శించారు. బీఎస్సీ విద్యార్థులకు మృత్తికగుణాలు, పోషక విలువలు, వ్యవసాయ ఉత్పాదకతపై అవగాహన పెంపొందించేందుకు సందర్శన ఉపయోగపడిందని వృక్షశాస్త్ర విభాగాధిపతి డా.నర్మద తెలిపారు. మృత్తిక పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, సుస్థిర వ్యవసాయ విధానాల గూర్చి ప్రయోగ అనుభవం పొందేందుకు సందర్శన ఉపయోగపడిందని రసాయన శాస్త్ర విభాగాధిపతి డా.రుకియాభాను తెలిపారు. ఏడీఏ గ్రేస్ ఎవాంజలి పాల్గొన్నారు.

'పరీక్ష పే చర్చ' వీక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎస్సెస్సీ పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం పరీక్ష పే చర్చ కార్యక్రమాన్ని ఆన్‌లైన్ విధానంలో నిర్వహించింది. ఇందులో ప్రధానమంత్రి మోదీ హాజరై మాట్లాడారు. షాషాబ్‌గుట్టలోని పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని డీఈఓ ప్రవీణ్‌కుమార్ విద్యార్థులతో కలిసి వీక్షించారు. విద్యార్థులు పరీక్షలకు మానసికంగా బలంగా ఉండి ఎదుర్కొవాల్సిన అవసరం ఉందని, తమలో తామే పోటీ పడాలని, ఇతరులతో పోటీ పడవద్దని ప్రధాని సూచించారు. సరైన నిద్ర, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలన్నారు. విఫలమైన అంశాల పట్ల కొత్త విషయాలు తెలుసుకుని, తప్పులను సరిదిద్దుకుని జీవితంలో ముందు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ దుకుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో హీరో సుమన్, మాస్టర్ జహంగీర్

మహబూబ్‌నగర్ క్రీడలు: విశాఖపట్నంలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 2వ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన కింగ్‌షోటోకాన్ కరాటేడూ ఇండియా విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు ఫౌండర్ జహంగీర్‌పాషా ఖాద్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపోటీల్లో సీనియర్ వ్యక్తిగత కటాలో మహ్మద్ హుజేఫా షరీఫ్ బంగారు పతకం, కుమితే వి భాగంలో కాంస్య పతకం సాధించారన్నారు. అలాగే 13, 14, 15ఏళ్ల విభాగాల్లో ఆయేషాబేగం, సాబేర్ పాష, సూఫియాన్‌అలీ, మా రియబేగం బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. 12ఏళ్ల విభాగంలో అమాన్‌అలీ బంగారు పతకం, హఫిసాబేగం, నిఖిల్ రజత పతకాలు, సాయిప్రణీత్ కాంస్య పతకాలు దక్కించుకున్నారని అన్నారు. సినీ హీరో సుమన్ విజేతలకు పతకాలతో పాటు సర్టిఫికెట్లు అందించారు.

వైభవంగా శ్రీలక్ష్మీనృసింహస్వామి ఉత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో చిన్నారుల నృత్య ప్రదర్శన

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రం కొత్తగంజ్ సింహగిరిలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం చతుస్థానార్చనలు, మూల మంత్ర హవనములు, పూర్ణాహుతి, శేషవాహన సేవ, బలిహరణం, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు సాయమారాధన, హనుమత్ వాహనసేవ నిర్వహించారు. ఎదుర్కోలు సాంప్రదాయబద్ధంగా జరిగాయి. లక్ష్మీదేవి అమ్మవారిని, నృసింహస్వామి మూలవిరాట్‌లను వేర్వేరుగా ఊరేగించారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



గండీడ్: మండలంలోని జంగంరెడ్డిపల్లిలో సోమవారం గ్రామస్తులు ఆంజనేయస్వామి, నవగ్రహ, నాగులు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే సతీమణి ఉమారామ్మోహన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి ఆధ్యాతికత ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, గండీడ్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠుడి పల్లకీసేవ



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక బీకేరెడ్డి కాలనీలోని పురాతన శివాలయంలో దీక్ష తీసుకున్న శివభక్తుల ఆధ్వర్యంలో సోమవారం నీలకంఠుడి పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ దంపతులు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

రచయితకు సన్మానం



దేవరకద్ర: మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవస్థానంకు సంబంధించి సద్గురు స్వామి జీవిత చరిత్ర పుస్తక రచయిత దుప్పల్లి శ్రీరాములు, స్వరలహరి అకాడమీ సంస్థాపకులు భాగన్నగౌడ్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. దేవస్థానం ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు గోవర్దన్ రెడ్డి, వెంకటయ్య, సూరిబాబు పాల్గొన్నారు

నోటీసు బోర్డులో ఓటర్ల జాబితా



ఓటర్ల జాబితాను విడుదల చేస్తున్న ఎంపీడీఓ ప్రభాకర్ తదితరులు

భూత్పూర్: స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారులు ఓటర్ల జాబితాను రూపొందించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని 10 ఎంపీటీసీ స్థానాలకు 27,334 ఓటర్ల జాబితాను కార్యాలయంలో నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచినట్లు ఎంపీడీఓ ప్రభాకర్ తెలిపారు. పురుషుల ఓటర్లు 13,641 మంది, మహిళా ఓటర్లు 13,693 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 52 మంది అధికంగా ఉన్నారు.